మనం
కడప | అన్నమయ్య




# కడప జిల్లాలో జోరందుకున్న ఎంపీటీసీ ఎన్నికల సమరం

**పోటెత్తిన నామినేషన్లు - 413 ఎంపీటీసీ స్థానాలకు1,509నామినేషన్లు**

**టీడీపీ 919, వైసీపీ 310 నామినేషన్లు - స్వతంత్రుల రూపంలో రెబల్స్ ముప్పు**

మనం ప్రతినిధి కడప అక్టోబర్ 23

వైఎస్సార్ కడప జిల్లా వ్యాప్తంగా మొత్తం 413 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ అత్యంత వేగంగా కొనసాగుతోంది. ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు పెద్ద సంఖ్యలో ముందుకొస్తుండటంతో మండల కేంద్రాల్లోని నామినేషన్ కేంద్రాలన్నీ కోలాహలంగా మారాయి. శుక్రవారం నాటికి ఒక్కరోజే ఏకంగా 673 నామినేషన్లు దాఖలు కాగా, ఇప్పటివరకు అందిన మొత్తం నామినేషన్ల సంఖ్య రికార్డు స్థాయిలో 1,509కి చేరినట్లు రిటర్నింగ్ అధికారి అధికారికంగా వెల్లడించారు. ఈ ఎన్నికల్లో ప్రధానంగా తెలుగుదేశం పార్టీ అత్యధిక సంఖ్యలో నామినేషన్లు వేయగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం గట్టి పోటీనిస్తూ భారీగా పత్రాలు సమర్పించింది. మరోవైపు కూటమి, ఇతర పక్షాలతో పాటు అసంతృప్త నేతలు, స్థానిక నాయకులు స్వతంత్రులుగా పెద్ద సంఖ్యలో నామినేషన్లు వేయడంతో జిల్లావ్యాప్తంగా గ్రామీణ రాజకీయాల్లో ఆసక్తికర వాతావరణం నెలకొంది.

### రికార్డు స్థాయిలో నామినేషన్ల జోరు

జిల్లాలోని 413 ప్రాదేశిక నియోజకవర్గాలకు పోటీ తీవ్రంగా నెలకొంది. శుక్రవారం ఒక్కరోజే 673 నామినేషన్లు దాఖలు కావడంతో మొత్తంసంఖ్య 1,509కి పెరిగింది. సగటున ఒక్కో ఎంపీటీసీ స్థానానికి ముగ్గురి నుంచి నలుగురు అభ్యర్థులు బరిలోకి దిగుతుండటంతో పోటీ ప్రతిష్టాత్మకంగా మారింది.

### పార్టీల వారీగా నామినేషన్ల వివరాలు

జిల్లావ్యాప్తంగా దాఖలైన మొత్తం 1,509 నామినేషన్లలో అత్యధికంగా తెలుగుదేశం పార్టీ తరఫున 919 నామినేషన్లు దాఖలవగా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 310 నామినేషన్లు దాఖలయ్యాయి. అలాగే భారతీయ జనతా పార్టీ తరఫున 80, జనసేన పార్టీ తరఫున 72, సిపిఐ ఎం నుంచి 19, కాంగ్రెస్‌పార్టీ తరఫున 6, బహుజన్ సమాజ్ పార్టీ నుంచి ఒక నామినేషన్ దాఖలయ్యాయి. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. ఇతర పార్టీల కోటాలో బీసీవైపీ తరఫున ఒకటి, సీపీఐ తరఫున ఒకటి చొప్పున మొత్తం రెండునామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులు ఏకంగా 100 స్థానాల్లో నామినేషన్లు సమర్పించారు.

### స్వతంత్రుల రూపంలో రెబల్స్ ముప్పు?

జిల్లా వ్యాప్తంగా స్వతంత్రుల కోటాలో ఏకంగా 100 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీలలో టికెట్లు దక్కని అసంతృప్త నేతలు, స్థానిక నాయకులు స్వతంత్రులుగా బరిలో నిలవడంతో కీలక స్థానాల్లో పోటీ త్రిముఖంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### పరిశీలన, ఉపసంహరణలపైనే తదుపరి దృష్టి

నామినేషన్ల స్వీకరణ అనంతరం అధికార యంత్రాంగం నామినేషన్ పత్రాల పరిశీలన చేపట్టనుంది. నిబంధనల ప్రకారం లేని దరఖాస్తులను తిరస్కరించిన తర్వాత, ఉపసంహరణ ప్రక్రియ ముగిస్తేనే బరిలో ఉండే తుది అభ్యర్థుల స్పష్టత వస్తుంది. అసంతృప్తులను, రెబల్ అభ్యర్థులను దారికి తెచ్చేందుకు ఆయా పార్టీల అధిష్టానాలు, ముఖ్య నేతలు తెరవెనుక చర్చలు వేగవంతం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ యంత్రాంగం గట్టి బందోబస్తు చర్యలు చేపట్టింది.

# అన్నమయ్య జడ్పీటీసీ సమరంలో టీడీపీ దూకుడు 105 నామినేషన్లతో సత్తా!

**25 స్థానాల్లో 277 నామినేషన్లు.. వైసీపీ 128, టీడీపీ 105**

**ప్రధాన పోటీలో కూటమి.. మండలాల వారీగా మారుతున్న రాజకీయ సమీకరణాలు**




మనం ప్రతినిధి మదనపల్లి అక్టోబర్ 23:

అన్నమయ్య జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికల సమరం ఆసక్తికరంగా మారుతోంది. నామినేషన్ల గణాంకాలు రాజకీయ పార్టీల బలాబలాలను అంచనా వేసేందుకు కీలకంగా నిలుస్తున్నాయి. జిల్లాలోని 25 జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి మొత్తం 277 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల నుంచి 105 నామినేషన్లు దాఖలు కాగా, వైఎస్సార్‌సీపీ నుంచి 128 నామినేషన్లు నమోదయ్యాయి. ఈ రెండు ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొన్నప్పటికీ, టీడీపీ సైతం గణనీయమైన సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల బరిలో తన ఉనికిని చాటుతోంది. జనసేన, బీజేపీతో పాటు కాంగ్రెస్, ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు కూడా బరిలో నిలవడంతో మండలాల వారీగా పోటీ స్వరూపం మారుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ స్థానాలు గ్రామీణ రాజకీయాలకు కీలకమైనవి కావడంతో అభ్యర్థుల ఎంపిక, స్థానిక నాయకుల ప్రభావం, క్షేత్రస్థాయి కార్యకర్తల బలం ఫలితాలను ప్రభావితం చేయనున్నాయి. అధికార కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సమన్వయంతో ముందుకు సాగితే పలు మండలాల్లో పోటీ మరింత ఆసక్తికరంగా మారే అవకాశం ఉంది. అయితే నామినేషన్ల సంఖ్య ఒక్కటే విజయావకాశాలను నిర్ధారించదు. అభ్యర్థుల వ్యక్తిగత బలం, స్థానిక సమస్యలు, గ్రామస్థాయి రాజకీయ సమీకరణాలు, ప్రచార వ్యూహాలే తుది ఫలితాల్లో కీలక పాత్ర పోషించనున్నాయి.

### 25 స్థానాలు.. 277 నామినేషన్లు

జిల్లాలోని 25 జడ్పీటీసీ స్థానాలకు మొత్తం 277 నామినేషన్లు దాఖలైనట్లు అధికారిక నివేదిక వెల్లడిస్తోంది. ఒక్కో స్థానానికి సగటున 11కు పైగా నామినేషన్లు రావడం పోటీపై ఆసక్తిని తెలియజేస్తోంది. అయితే ఒకే అభ్యర్థి దాఖలు చేసిన బహుళ నామినేషన్లు ఉన్నాయా, ఉపసంహరణల తర్వాత ఎంతమంది తుది బరిలో ఉంటారన్నది తదుపరి దశలో స్పష్టమవుతుంది.

### టీడీపీకి మండలాల్లో పోటీకి సిద్ధమైన అభ్యర్థులు

టీడీపీ తరఫున జిల్లావ్యాప్తంగా 105 నామినేషన్లు నమోదయ్యాయి. మండలాల వారీగా అభ్యర్థుల సంఖ్యలో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. కొన్ని మండలాల్లో టీడీపీ అభ్యర్థులు గట్టి పోటీకి సిద్ధమవుతుండగా, మరికొన్ని చోట్ల ఇతర పార్టీల అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. దీంతో స్థానిక నాయకత్వం అభ్యర్థులకు మద్దతుగా ప్రచారాన్ని సమన్వయం చేయడం, ఓటర్లను చేరుకోవడం కీలకం కానుంది.

### వైసీపీతో ప్రధాన పోటీ

వైఎస్సార్‌సీపీ తరఫున 128 నామినేషన్లు నమోదయ్యాయి. అధికారిక గణాంకాల ప్రకారం, టీడీపీ కంటే వైసీపీ నామినేషన్లు 23 ఎక్కువగా ఉన్నాయి. అయితే నామినేషన్ల సంఖ్యను మాత్రమే పార్టీ బలానికి కొలమానంగా తీసుకోలేం. అభ్యర్థుల సామర్థ్యం, స్థానిక ప్రజాభిమానం, పార్టీ శ్రేణుల పనితీరు, ఎన్నికల ప్రచారం ఆధారంగా పోటీ మారే అవకాశం ఉంది.

### కూటమి పార్టీల పాత్ర కీలకం

బీజేపీ తరఫున 8, జనసేన తరఫున 12 నామినేషన్లు నమోదయ్యాయి. టీడీపీతో పాటు ఈ రెండు పార్టీల స్థానిక శ్రేణుల సమన్వయం ఎన్నికల్లో ప్రాధాన్యం సంతరించుకోనుంది. కూటమి పార్టీల మధ్య పరస్పర సహకారం, అభ్యర్థులకు మద్దతు, గ్రామస్థాయి ప్రచార వ్యూహాలు పోటీపై ప్రభావం చూపనున్నాయి.

### ఇతర పార్టీలూ బరిలో

కాంగ్రెస్ తరఫున 7, సీపీఐ తరఫున 7, సీపీఎం తరఫున 1, బీఎస్పీ తరఫున 3 నామినేషన్లు నమోదయ్యాయి. స్వతంత్రులుగా 5 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీటితో పాటు నివేదికలో ఇతర పార్టీలకు సంబంధించిన ఒక నామినేషన్ కూడా నమోదైంది. ఈ అభ్యర్థుల తుది పోటీ, స్థానిక ప్రభావం మండలాల వారీగా ఎన్నికల సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

### తుది బరిలో ఎవరు? ఉత్కంఠ

నామినేషన్ల దాఖలు పూర్తయిన తర్వాత పరిశీలన, ఉపసంహరణల ప్రక్రియలో ఎంతమంది అభ్యర్థులు తుది బరిలో నిలుస్తారన్నది కీలకం. ఆ తర్వాతే ప్రతి జడ్పీటీసీ స్థానంలో ప్రధాన పోటీదారులెవరు, ఏ పార్టీకి ఎక్కడ అనుకూల పరిస్థితులు ఉన్నాయి, కూటమి వ్యూహాలు ఏ మేరకు ఫలిస్తాయన్న అంశాలపై స్పష్టత రానుంది. అన్నమయ్య జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికలు గ్రామీణ రాజకీయాలకు పరీక్షగా మారుతున్న నేపథ్యంలో టీడీపీ తన క్షేత్రస్థాయి బలాన్ని ఓట్లుగా మలుచుకోవడంపైనే ప్రధానంగా దృష్టి సారించాల్సి ఉంది.



# మూడు పురపాలక సంస్థల్లో నేటి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ

**జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**

**అర్హులైన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి**

**ప్రశాంతంగా జెడ్పీటీసి, ఎంపీటీసీ నామినేషన్లు**

కడప, అక్టోబర్ 23 మనం న్యూస్

వైఎస్సార్ కడప జిల్లాలోని కడప నగరపాలక సంస్థ, రాజంపేట, మైదుకూరు పురపాలక సంఘాల్లోని నిర్దేశిత వార్డులకు నామినేషన్ల దాఖలుకు అదనపు అవకాశం కల్పిస్తూ గడువును పొడిగించడంతో.. కడపలో 11 వార్డులు, రాజంపేటలో 11 వార్డులు, మైదుకూరులో 32 వార్డులకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ సజావుగా కొనసాగుతోందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. శుక్రవారం జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తోకలిసి.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా.. రాష్ట్ర ఎన్నికల కమీషన్ నిర్దేశించిన జిల్లాలోని మూడు పట్టణ స్థానిక సంస్థల్లో అక్టోబర్ 24వ తేదీ శనివారం సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా కలెక్టరేట్‌లోనూ నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేశామని, అక్కడ కూడా పలువురు అభ్యర్థులు మొదటి రోజు నామినేషన్లు సమర్పించినట్లు పేర్కొన్నారు. గతంలో నామినేషన్లు దాఖలు చేయలేకపోయిన అభ్యర్థులందరికీ ఈ అవకాశం కల్పించామని, వారు గడువులోగా నామినేషన్లు సమర్పించాలని సూచించారు.

### ప్రశాంతంగా జెడ్పీటిసి, ఎంపీటీసీ నామినేషన్లు.

జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియను కూడా ఉదయం నుంచి అన్ని ప్రాంతాల్లో పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని, మరికొందరు నామినేషన్లు సమర్పిస్తున్నారని వెల్లడించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సహాయం కోరిన అభ్యర్థులకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ సమన్వయంతో సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని భరోసా ఇచ్చారు. ఎవరైనా అభ్యర్థులకు భద్రతాపరమైన ఆందోళనలు ఉంటే పోలీసు నియంత్రణ గదిని సంప్రదించాలని సూచించారు. నామినేషన్ కేంద్రానికి చేరుకునే వరకు అవసరమైన సహాయం, భద్రత కల్పించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేశామని పేర్కొన్నారు. జిల్లాలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా కొనసాగుతోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా మిగిలిన ప్రక్రియలు కూడా సజావుగా, పారదర్శకంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ తెలిపారు.



## ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల ఘట్టం

### ప్రొద్దుటూరు, రాజుపాలెంలో 98 నామినేషన్లు

ప్రొద్దుటూరు అక్టోబర్ 23 ( మనం న్యూస్ ) : ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల్లో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల దాఖలు ప్రక్రియ శుక్రవారంతో ప్రశాంతంగా ముగిసింది. రెండు మండలాల్లో కలిపి మొత్తం 98 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజైన శుక్రవారం ప్రొద్దుటూరు మండలంలో సుమారు 53, రాజుపాలెం మండలంలో 12 నామినేషన్లు సమర్పించినట్లు సమాచారం. ప్రొద్దుటూరు మండలంలో పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల వారీగా టీడీపీ నుంచి 37, వైసీపీ నుంచి 17, జనసేన నుంచి 7, సీపీఎం నుంచి 3, స్వతంత్ర అభ్యర్థి నుంచి ఒక నామినేషన్ దాఖలైంది. దీంతో మొత్తం 65 నామినేషన్లు నమోదయ్యాయి. రాజుపాలెం మండలంలో చివరి రోజు గాదెగూడూరు నుంచి నాలుగు, పర్లపాడు, వెలవలి గ్రామాల నుంచి రెండేసి నామినేషన్లు దాఖలయ్యాయి. కొర్రపాడు, పగిడేల, టంగుటూరు, ఏర్వపాలెం గ్రామాల నుంచి ఒక్కొక్క నామినేషన్ సమర్పించారు. దీంతో రాజుపాలెం మండలంలో మొత్తం నామినేషన్ల సంఖ్య 33కు చేరింది. నామినేషన్ల దాఖలు గడువు ముగియడంతో ఎన్నికల ప్రక్రియ తదుపరి దశకు చేరుకుంది. నామినేషన్ల పరిశీలన అనంతరం పోటీలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది. ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు.

## బెదిరింపులకు భయపడొద్దు.. పోలీసులకు ఫిర్యాదు చేయండి

### డి.ఎస్.పి బాలస్వామి రెడ్డి



ప్రొద్దుటూరు, అక్టోబర్ 23 ( మనం న్యూస్): మండల పరిషత్ ఎన్నికల్లో నామినేషన్ల దాఖలుకు ఎవరైనా ఆటంకాలు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బాలస్వామి రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ బోర్డులోని ఎంపీడీవో కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ, అభ్యర్థులు నిర్భయంగా నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. బెదిరింపులకు గురిచేసినా, నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులకు రక్షణ కల్పించి, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు.

## నేడు నామినేషన్ల పరిశీలన ఆర్ఓ.జయ భరత్ రెడ్డి



చిట్వేలి అక్టోబర్ 23 మనం న్యూస్: చిట్వేలి మండల ప్రజా పరిషత్ ఎంపీటీసీ ఎన్నికలు 2026 కు సంబంధించి గత మూడు రోజులుగా 21,22,23 తేదీల నాడు నిర్వహించిన 96 నామినేషన్ల పత్రాల పరిశీలన అక్టోబర్ 24 శనివారం ఉదయం 8 గంటల నుంచి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మండల ఎన్నికల అధికారి ఆర్ఓ జీ.జయ భరత్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంబంధిత అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించవలసిందిగా ఆయన తెలియజేశారు.

## రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదినం సందర్భంగా పేదలకు అన్నదానం



చిట్వేలి అక్టోబర్ 23 మనం న్యూస్: పాన్ ఇండియా యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ జన్మదినం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని ఎం.రాచపల్లి ప్రభాస్ అభిమాన సంఘం గ్రామ యువత, మానవత చిట్వేలి శాఖ ఆధ్వర్యంలో స్థానిక శివాలయం నందు పేదలకు, యాచకులకు, పారిశుద్ధ్య కార్మికులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాస్ అభిమాన సంఘం యువత మాట్లాడుతూ తమ అభిమాన హీరో పుట్టినరోజు సందర్భంగా పేదలకు ఒక పూట భోజనం పెట్టడం ఎంతో సంతోషంగా ఉందని, అలాగే రెబల్ స్టార్ ప్రభాస్ సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ప్రభాస్ అభిమానులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా సభ్యులు కో చైర్మన్ కుంభగిరి మునిరావు, కన్వీనర్ కరీంభాయ్ గారి సాయిరాం, ఎం.రాచపల్లి ప్రభాస్ అభిమాన సంఘం గ్రామ యువత, తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఒంటిమిట్టలో ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

### చివరి రోజు 40 నామినేషన్లు.. టీడీపీ నుంచి 22 - మొత్తం 54 నామినేషన్ల దాఖలు



ఒంటిమిట్ట, అక్టోబరు 23 మనం న్యూస్ : ఒంటిమిట్ట మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. ఒక్కరోజే 40 నామినేషన్లు నమోదయ్యాయి. దీంతో మూడు రోజుల్లో మొత్తం 54 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు టీడీపీ తరఫున అత్యధికంగా 22 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్‌సీపీ నుంచి ఏడుగురు, జనసేన నుంచి నలుగురు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. మరో ఏడుగురు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. గడువు ముగుస్తుండటంతో అభ్యర్థులు, వారి అనుచరులతో నామినేషన్ కేంద్రం వద్ద సందడి నెలకొంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన బుధవారం టీడీపీ తరఫున ఒక నామినేషన్ దాఖలైంది. రెండో రోజైన గురువారం టీడీపీ నుంచి 12, స్వతంత్ర అభ్యర్థిగా ఒక నామినేషన్ నమోదైంది. దీంతో తొలి రెండు రోజుల్లో కలిపి 14 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు ఒక్కసారిగా 40 నామినేషన్లు నమోదు కావడంతో ఎన్నికల సందడి పెరిగింది. మూడు రోజుల పాటు సాగిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. తదుపరి నామినేషన్ పత్రాల పరిశీలన, నిబంధనల మేరకు ఉపసంహరణ ప్రక్రియ జరగనుంది. అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్యపై స్పష్టత రానుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా పోటీకి సిద్ధం కావడంతో మండలంలో స్థానిక ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. అభ్యర్థుల ఖరారు తర్వాత రాజకీయ సమీకరణాలు మరింత వేడెక్కే అవకాశం ఉంది.

## చివరిరోజు ముమ్మరంగా 47 నామినేషన్లు దాకులు: పరిశీలించిన జెసి



చిట్వేలి అక్టోబర్ 23 మనం న్యూస్: మండల పరిధిలోని 12 ఎంపీటీసీ స్థానాలకు గాను చివరిరోజు శుక్రవారం ముమ్మరంగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఈ సందర్భంగా 47 మంది నామినేషన్లు వెయ్యగా వీరిలో టిడిపి 21, వైసిపి18, జనసేన 3, బిజెపి1, స్వతంత్ర అభ్యర్థులు 4 నామినేషన్లు వేసినట్లు మండల ఎన్నికల అధికారి జయ భరత్ రెడ్డి తెలియజేశారు. ఈ మూడు రోజుల వ్యవధిలో మొత్తం 96 నామినేషన్లు దాఖలైనట్లు ఆయన పేర్కొన్నారు. వీటిలో పార్టీల వారీగా పరిశీలిస్తే టిడిపి తరపున అత్యధికంగా 37 నామినేషన్లు దాఖలు కాగా, వైసీపీ నుంచి 32, జనసేన నుంచి 15, బిజెపి నుంచి 4, స్వతంత్ర అభ్యర్థులుగా 7, బీసీవై పార్టీ నుంచి 1, నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు తెలిపారు. అధికారులు విడుదల చేసిన ప్రకారం అక్టోబర్ 21వ తేదీన 12, 22వ తేదీన 37, చివరి 23వ తేదీన 47 నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో నామినేషన్ల ప్రక్రియలో చివరి రోజు అభ్యర్థుల నుంచి మంచి స్పందన లభించింది. తుమ్మ కొండ, నగిరిపాడు, తిమ్మయ్య గారి పల్లి స్థానాల్లో 11 చొప్పున నామినేషన్లు నమోదు అయ్యాయి. చిట్వేలి 2 స్థానంలో అత్యధికంగా 16 నామినేషన్లు నమోదవుగా, కె ఎస్ అగ్రహారంలో 7, రాజుకుంటలో 6, మాలేమాపురంలో 5, చిట్వేలి 1లో 5, మైలపల్లిలో4, నాగవరంలో 3, నామినేషన్లు మొదలయ్యాయి. తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు చిట్వేలి లోని ఎంపీడీవో కార్యాలయం నందు నామినేషన్ల కార్యాలయాన్ని పరిశీలించారు. మండల ఎన్నికల అధికారి జయ భరత్ రెడ్డితో నామినేషన్ల నమోదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతల విషయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా జెసి ఆర్.గోవిందరావు ఎస్సై వినోద్ కుమార్ కు ఆదేశించారు.

## ప్రశాంతంగ ముగిసిన ఎంపీటీసి నామినేషన్‌ల ప్రక్రియ





పెనగలూరు( అక్టోబర్ 23), మనంన్యూస్: ఎంపిటిసి నామినేషన్ ల ప్రక్రియ ప్రశాంతం గ ముగిసింది. మూడో రోజు 11 ఎంపిటిసి స్థానాలకు గాను 39 నామినేషన్ లు దాఖలు అయినట్లు ఆర్వో చిన్న రెడ్డయ్య తెలిపారు. మొత్తం మూడు రోజులకు గాను 74 నామినేషన్ లు అభ్యర్థులు వేసినట్లు చెప్పారు. నేడు అభ్యర్థులు వేసిన నామినేషన్లు స్క్రుట్నీ నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈటిమార్పూరం ఎంపిటిసి కి కోడూరు వెంటయ్య ( టీడీపీ ), చాపల గిరిబాబు ( వైసీపీ ), కోనేరు అజయ్ కుమార్ ( వైసీపీ ), పొందలూరు ఎంపిటిసి కి వడ్డి చెంగల్ రెడ్డి ( వైసీపీ ), పోతిరెడ్డి సుబ్బారెడ్డి ( వైసీపీ ), కుట్లూరు హరినాథ్ ( ఇండిపెండెంట్ ), పెనగలూరు-1 ఎంపిటిసి కి బచ్చల లక్ష్మి నరసింహ రెడ్డి (టీడీపీ), గంధంశెట్టి రామయ్య (టీడీపీ), పాలెపు శ్రీరామ్ రెడ్డి (వైసీపీ), ఏటూరి మధుసుదన్ రెడ్డి (వైసీపీ), తొండపునాటి రాజేష్ (వైసీపీ ), కొండూరు -1 ఎంపిటిసి కి ఇరువురి కావేరి ( వైసీపీ ), మద్దెల రాములమ్మ ( జనసేన ), కట్టావారిపల్లి ఎంపిటిసి కి మన్నూరు భారతి ( టీడీపీ ), గౌర సుగుణమ్మ ( టీడీపీ ), కొల్లా సుభద్రమ్మ ( ఇండిపెండెంట్ ), శింగారెడ్డి పల్లి ఎంపిటిసి కి బత్తల వాణి ( టీడీపీ ), గుండ్లూరు నాగమ్మ (వైసీపీ ), అనంతంపల్లి ఎంపిటిసికి పొగడతోటి శిరీష ( వైసీపీ ), కొండూరు -2 ఎంపిటిసి కి పాగల రమణయ్య ( వైసీపీ ), వెలగచర్ల నరసింహులు ( జనసేన ),దేవరపల్లి చిరంజీవి ( జనసేన ), మందా హరికృష్ణ ( వైసీపీ ), ఓబిలి ఎంపిటిసి కి కొడిదెల సాయి కుమార్ ( జనసేన ),గానుగపెంట ఆదినారాయణ ( సీపీఐ ), షేక్ చాంద్ బాషా ( వైసీపీ ), కొప్పోలు విజయ భాస్కర్ రెడ్డి ( జనసేన, ఇండిపెండెంట్ ), సోమేసుల హరీష్ ( ఓబిలి ), నల్లపురెడ్డిపల్లి ఎంపిటిసికి కొట్లూరు నరసమ్మ ( టీడీపీ ), కొత్తపల్లి అరుణ ( టీడీపీ ), చందారెడ్డి సుమతి ( టీడీపీ ), కామనూరు మౌనిక ( వైసీపీ ), పాటూరు అరుణ ( ఇండిపెండెంట్ ),మొలకల సావిత్రమ్మ (జనసేన ), పెనగలూరు-2 ఎంపిటిసి కి కోడూరు నరసింహ ప్రసాద్ ( వైసీపీ ), కోడూరు నరసింహులు ( వైసీపీ ) నామినేషన్ లు వేశారు.

**పోలీసులు పనితీరు భేష్**

పెనగలూరు పోలీసుల ఉత్తమ పనితీరు తో అన్ని పార్టీల వారు నామినేషన్ లు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేశారు. తిరుపతి డిఎస్పీ శ్రీనివాసరావు మధ్యాహ్నం నుండి నామినేషన్ ప్రక్రియ ముగిసే వరకు పెనగలూరు నామినేషన్ కేంద్రం వద్దనే ఉన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుమని, ఎంపీడివో మోహన్, డిప్యూటీ ఎంపీడివో శ్రీకాంత్, ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## డివైడర్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

### ధర్మయ్యకు కాలు విరుగు.. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలింపు

ముద్దనూరు,అక్టోబర్, 23, మనం న్యూస్: ఆ రహదారి వెంబడి ప్రయాణించాలంటే మృత్యు రహదారి లాగా మారింది. ముద్దనూరు--తాడిపత్రి ప్రధాన రహదారిపై మరో ప్రమాదం చోటుచేసుకుంది. మండల పరిధిలోని ఓబులాపురం గ్రామ సమీపంలో శుక్రవారం కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ధర్మయ్యకు కాలు విరగ్గా, పెంచలమ్మ, యానాదమ్మ అనే ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం రాజంపేట నుంచి తాడిపత్రి పట్టణానికి



వైద్యం నిమిత్తం పెంచలమ్మ, యానాదమ్మలను కారులో తీసుకెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఓబులాపురం గ్రామ సమీపానికి చేరుకున్న సమయంలో కారు అదుపుతప్పి రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. కారులో ఐదుగురు ప్రయాణిస్తుండగా ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ముద్దనూరు--తాడిపత్రి ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం రాకపోకలు సాగించే ఈ రహదారిపై ప్రమాదాల నివారణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పుల్లంపేటలోముగిసిన ఎంపీటీసీ నామినేషన్ ప్రక్రియ

## నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు





పుల్లంపేట అక్టోబర్ 23 మనంన్యూస్ తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో ఎంపీటీసీ స్థానాలకు మూడు రోజులుగా కొనసాగిన నామినేషన్ ప్రక్రియ ముగిసింది. చివరి రోజైన శుక్రవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు వివిధ రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 57 నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలుగుదేశం పార్టీ నుంచి 23, జనసేన నుంచి 8, బీజేపీ నుంచి 1, వైఎస్సార్‌సీపీ నుంచి 19, స్వతంత్ర అభ్యర్థులుగా 6 నామినేషన్లుదాఖలయ్యాయి. గత రెండు రోజుల్లో 22 నామినేషన్లు నమోదు కాగా, చివరి రోజు భారీగా అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు.గత రెండు రోజులు గా జరిగిన పరిణామాల నేపథ్యంలో చివరి రోజు నామినేషన్ కేంద్రం వద్ద పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. రైల్వేకోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు, పుల్లంపేట ఎస్సై చిన్నరెడ్డప్ప ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన ప్రతి అభ్యర్థులను విడతలవారీగా నామినేషన్ కేంద్రంలోకి పంపి నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించారు. నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీపుల్లంపేటలో నామినేషన్ ప్రక్రియ జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు పరిశీలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీరభద్రారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ మురళీకృష్ణలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.మూడు రోజుల నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి అభ్యర్థుల తుది జాబితాపై పడింది. 11 ఎంపీటీసీ స్థానాల్లో ప్రధాన పార్టీల మధ్య పోటీ ఎలా ఉండనుంది? ఎవరు బరిలో నిలుస్తారు? విజయం ఎవరిని వరించనుంది? అన్నది స్థానికంగా రాజకీయ ఆసక్తిని రేకెత్తిస్తోం ది ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల పర్వంలో పుల్లంపేటలో 11 స్థానాలకు 57నామినేషన్లు బరిలో నిలిచేది ఎవరో గెలిచేది ఎవరో వేచి చూద్దాం

# మండలంలో ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ



సిద్దవటం, అక్టోబర్ 23 మనం న్యూస్
సిద్దవటం మండలంలో ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. మండలంలో 11 ఎంపిటిసి స్థానాలకు గాను 32 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్ఎన్ కృష్ణయ్య తెలిపారు. మొదటి రోజు నాలుగు, రెండో రోజు నాలుగు, చివరి రోజు అత్యధికంగా 24 నామినేషన్లు దాఖలైనట్లు వెల్లడించారు. సిద్దవటం జనరల్ మహిళ స్థానానికి రెండు, బొగ్గిడివారిపల్లి ఎస్సీ మహిళ స్థానానికి రెండు, జంగాలపల్లి ఎస్సీ జనరల్ స్థానానికి రెండు, మాచుపల్లి ఎస్సీ జనరల్ స్థానానికి నాలుగు, మాధవరం-1 జనరల్ మహిళ స్థానానికి రెండు, మాధవరం-2 బీసీ మహిళ స్థానానికి నాలుగు, పెద్దపల్లి బీసీ జనరల్ స్థానానికి నాలుగు, పొన్నవోలు ఓసీ జనరల్ స్థానానికి మూడు, టక్కోలు జనరల్ మహిళ స్థానానికి నాలుగు, ఉప్పరపల్లి ఓసీ జనరల్ స్థానానికి రెండు, వంతాటిపల్లి ఓసీ జనరల్ స్థానానికి మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఒంటిమిట్ట సీఐ వెంకటేశ్వర్లు, సిద్దవటం ఎస్సై హారిక ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్వోలు ఫణిరాజకుమారి,విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టే రోల్ ప్లే, జానపద నృత్య పోటీలు

## కళలు, సృజనాత్మకతతో జాతీయ స్థాయికి ఎదగాలి - డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి







రాయచోటి, అక్టోబర్ 23: విద్యార్థుల్లో సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై పదును పెట్టేందుకు జాతీయ స్థాయి రోల్ ప్లే, జానపద నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం డైట్‌లో పోటీలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో 9వ తరగతి విద్యా ర్థులు రోల్ ప్లే, 8, 9వ తరగతుల విద్యార్థులు జానపద నృత్య పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. రోల్ ప్లే, జానపద నృత్యాల్లో ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, లింగ సమా నత్వం, మాదకద్రవ్యాల నివారణ తదితర అంశాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఉండాలన్నారు. జానపద నృత్య బృందంలో 4 నుంచి 6 మంది విద్యార్థులు ఉండాలని, ప్రదర్శన 5-6 నిమిషాల వ్యవధిలో ఉండాలని తెలిపారు. అక్టోబర్ 30వ తేదీన రాయచోటి లోని డైట్ నందు ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొం టారన్నారు. పోటీలలో పాల్గొనేవారు npep.gov.in పోర్టల్ నందు మొదట రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వారిని మాత్రమే పోటీలకు అనుమతించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈ పోటీలకు సంబంధించి జిల్లా కోఆర్డినేటర్ కె. వెంకటసుబ్బారెడ్డి, డైట్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ




ముద్దనూరు అక్టోబర్ 23, మనం న్యూస్:
మండల పరిధిలోని పది ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు వివిధ రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కలిపి మొత్తం 32 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రఘురాం, డిప్యూటీ రిటర్నింగ్ అధికారి రాధాకృష్ణ వేణి తెలిపారు. తెలుగుదేశం పార్టీ తరఫున 13, భారతీయ జనతా పార్టీ తరఫున 11, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఆరు, స్వతంత్ర అభ్యర్థులుగా ఇరువురు నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు పేర్కొన్నారు. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సీఐ నగేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు భద్రతా చర్యలు చేపట్టారు. మరోవైపు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డంకులు ఎదుర్కొన్నారనే చర్చ స్థానికంగా సాగుతోంది.





# పారదర్శకంగా నామినేషన్ల ప్రక్రియ

## అన్నమయ్య జిల్లాలో నామినేషన్ కేంద్రాల తనిఖీ భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా జేసీ, ఎస్పీ

మనం ప్రతినిధి మదనపల్లి అక్టోబర్ 23: అన్నమయ్య జిల్లా పరిధిలో ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా, పూర్తి పారదర్శక వాతావరణంలో జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. నామినేషన్ల స్వీకరణ చివరి రోజు సందర్భంగా శుక్రవారం కలకడ, సంబేపల్లి, ఎల్.ఆర్.పల్లి, రామాపురం, గాలివీడు మండలాల్లోని నామినేషన్ కేంద్రాలను ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించారు. ఈ క్రమంలో రామాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని స్వయంగా తనిఖీ చేసి, అభ్యర్థుల కోసం కల్పించిన మౌలిక వసతులు, బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు.

### అప్రమత్తంగా వ్యవహరించాలి

ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి పోలీసు భద్రతను ఏర్పాటు చేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు దిగినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో సంబంధిత రెవెన్యూ, మండల స్థాయి అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ



కడప, అక్టోబరు 23 మనంన్యూస్: జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులకు సూచించారు.శుక్రవారం కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ చివరి రోజు ప్రక్రియను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నామినేషన్ పత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు పటిష్టంగా అమలు చేయాలని సూచించారు.

# ఎం.రాచపల్లి గ్రామంలో ఘనంగా ప్రభాస్ జన్మదిన వేడుకలు

## రెబల్ స్టార్ జన్మదినం సందర్భంగా 52 మంది రక్తదాతలతో రక్తదాన శిబిరం విజయవంతం




చిట్వేలి అక్టోబర్ 23 మనంన్యూస్: మండల పరిధిలోని మైలపల్లి పంచాయితీ ఎం.రాచపల్లి గ్రామంలో శుక్రవారం ప్రభాస్ అభిమాన సంఘం యువత, మానవత స్వచ్ఛందసేవా సంస్థ చిట్వేలి శాఖల ఆధ్వర్యంలో ప్రభాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శతాధిక రక్త దాత డాక్టర్ దొండ్లవాగు వేణుగోపాల్ పర్యవేక్షణలో తిరుపతి రెడ్ క్రాస్ సంస్థ వైద్యులు సంధ్యారాణి రక్తం సేకరించారు. ఈ శిబిరంలో 52మంది అభిమానులు రక్తం దానం చేశారు. సమాజ సేవకులు డాక్టర్ చంద్రశేఖర్ రక్తధానం చేయడంతో పాటు దాతలకు మనోధైర్యాన్ని ఇచ్చారు. రక్తదాతలకు ప్రసంశా పత్రాలను అందజేశారు. ఎం.రాచపల్లి గ్రామంలో వచ్చిన ప్రభాస్ అభిమానులకు, స్వచ్ఛంద సంస్థల వారికి ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మానవత ఆధ్వర్యంలో మధ్యాహ్నం చిట్వేలిలో కూడా పేదలకు, యాచకులకు, పారిశుధ్య కార్మికులకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత రాఘవరాజు. శివశంకర్ రాజు, యానాదిరాజు, చక్రవర్తుల వరుణ్ కుమార్ రాజు, వెంకటేశ్వర రాజు, చక్రవర్తుల నానీ, చక్రవర్తుల వర్మ, చక్రవర్తుల సుబ్బరాజు, గడ్డం. కార్తిక్, చొక్కారాజు చంద్రరాజు, నరేష్ రాజు, పాండురాజు నరేంద్రవర్మ, మానవత బాధ్యులు మునిరావు, సాయిరాం, గ్రామ యువత, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు.